క్లుప్తంగా

కొనసాగుతున్న రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: భూపాలరాజపురంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రామాలయ ప్రతిష్టోత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా కొనసాగాయి. కశింకోట చెందిన పురోహితులు రేజేటి రామాచార్యుల పర్యవేక్షణలో గ్రామానికి చెందిన దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు.ఆదివారం ఉదయం సీతారామలక్ష్మణుల విగ్రహాల ప్రతిష్టాపన, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సమస్యను ఫోన్‌లో వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: నీలకంఠరాజపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కడుబండి శ్రీనివాసరావు కోరారు. గ్రామంలో శనివారం నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతికి మాజీ ఎమ్మెల్యే కడుబండి అతిథిగా హాజరయ్యారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రెండు బోర్లు ఉన్నప్పటికీ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వెంటనే ఆయన స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవికి ఫోన్‌లో సమస్యను వివరించి, పరిష్కరించాలని సూచించారు.

నల్ల బెల్లం విక్రయించ వద్దు

గంట్యాడ: సారా తయారీలో ఉపయోగించే నల్లబెల్లాన్ని విక్రయించవద్దని విజయనగరం రూరల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ ఎం.వి జయలక్ష్మి బెల్లం వ్యాపారులకు సూచించారు. మండల కేంద్రంలో బెల్లం వ్యాపారులతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లాభాపేక్షతో సారా తయారీదారులకు పెద్ద మొత్తంలో బెల్లం విక్రయించడం సరికాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగించుకోండి

చీపురుపల్లి: పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు స్థానిక జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించామని, అధ్యాపకులు కూడా అందుబాటులో ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం విద్యార్థులు 80969 07533 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జి. కృష్ణవేణి(ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త జి.కృష్ణ వేణి (48)అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈమె భర్త ఇటీవలే మరణించారని, అప్పటి నుంచి తీవ్రమనోవేదనకు గురై అనారోగ్యం పాలయ్యారని బంధువులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. అంగన్‌వాడీ కార్యకర్త మృతిపై వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీఐటీయూ అధ్యక్షురాలు తుల సి, సీఐటీయూ నాయకులు తరిణి వెంకటరమణ,గాడి అప్పారావు సంతాపం తెలిపారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో ద్వితీయస్థానం



విద్యార్థిని ఆశ్రితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శాంతి

శృంగవరపుకోట: స్థానిక మొహంతి కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థిని రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో ద్వితీయ స్థానం సాధించిందని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ శాంతి మొహంతి శనివారం తెలిపారు. తెలంగాణ ఈ -అభ్యాస్ ఐఐటీ ఫౌండేషన్ వారు నిర్వహించిన బి.వి.వి.ఎస్ మెమోరియల్ గ్రాండ్ ఒలింపియాడ్ ఎగ్జామ్‌లో పాఠశాలకు చెందిన 1వ తరగతి విద్యార్థిని రేపాక ఆశ్రిత ద్వితీయ స్థానంతో స్కూల్‌కి గౌరవాన్ని తెచ్చిపెట్టిందన్నారు. ఈనెల 13న గుంటూరులో జరిగే ఈ అభ్యాసోత్సవంలో విద్యార్థిని అవార్డు అందుకోనుందని ఆమె తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సమస్యల వలయంలో.. వసతి గృహం

- శిథిలావస్థకు చేరుకున్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహ భవనాలు
- శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు
- బోరు వద్దే నిలిచిపోతున్న మురుగునీరు
- తలుపులూడిపోయి, శిథిల దశలో మరుగుదొడ్లు



శిథిలావస్థకు చేరిన సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహ భవనం

గంట్యాడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహం సమస్యల నిలయంగా మారింది. ఈ వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు నిద్రించే గదుల్లోనూ, భోజనశాల వద్ద , ప్రధాన ద్వారం వద్ద, వరండాల్లోనూ ఇలా ప్రతీ చోట భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శిథిల భవనాలతో పాటు మరుగుదొడ్లు, మురుగు సమస్య విద్యార్థులను వేధిస్తోంది. మరుగుదొడ్లు కూడా శిథిలమై ఎప్పుడు కూలిపోతాయో అన్న స్థితిలో ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయి. వసతి గృహంలోని బోరు వద్ద నుంచి మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో వాడుక నీరంతా అక్కడే నిలిచిపోతోంది. దీంతో నీరు మురుగుపోయి దుర్గంధం వస్తుండడం, దోమలు వృద్ధి చెందడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న హాస్టల్ భవనం పైకప్పు



బోరు వద్ద నిలిచిపోయిన మురుగునీరు

మరమ్మతులు చేయిస్తాం..

వసతి గృహం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుంది. టెండర్ ఖరారు కాగానే మరమ్మతులు పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– గోవింద సన్యాసిరావు, వసతిగృహం వార్డెన్



మరుగుదొడ్డి తలుపు ఊడిపోయిన దృశ్యం

జీవనోపాధుల ప్రణాళికలు సిద్ధం చేయాలి



గుర్ల: వీఓఏలు, ఎన్యూమరేటర్లకు సూచనలు చేస్తున్న ఏపీడీ సావిత్రి



చీపురుపల్లి: మాట్లాడుతున్న స్త్రీ నిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యుల జీవనోపాధులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని స్త్రీ నిధి ఏజీఎం ఏ.ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యుమరేటర్లకు ఇస్తున్న శిక్షణను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంఘాల్లోని సభ్యుల జీవనోపాధులు, వాటికి అవసరమైన బ్యాంకు రుణ ప్రణాళిక సిద్ధం చేసుకుని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్యుమరేటర్లు గత నాలుగు రోజులుగా శిక్షణలో తెలుసుకున్న అంశాల ప్రకారం గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ నిధి మేనేజర్ వై.ఎర్రినాయుడు, సీసీ పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయాలి

గుర్ల: డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా చూడాల్సిన బాధ్యత వీఓఏలపై ఉందని వెలుగు ఏపీడీ సావిత్రి అన్నారు. వార్షిక రుణాలు, జీవనోపాధుల ప్రణాళికలపై స్థానిక వెలుగు కార్యాలయంలో వీఏఓలు, ఎన్యూ మరేటర్లకు మూడోరోజు శనివారం నిర్వహించిన శిక్షణను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ జీవనోపాధి అవకాశాలు మెరుగుపరుచు కునేలా గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్వాక్రా సంఘ సభ్యులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించి, వారు చిరు వ్యాపారాలు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు.రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించేలా చూడాలని చెప్పారు. డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం భారతి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యమెందుకు..?

- మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టిన సభ్యులు
- తహసీల్దార్, ఉప తహసీల్దార్‌ల తీరుపై మండిపడ్డ జెడ్పీ చైర్మన్



తహసీల్దార్ అజూ రఫీజాన్‌ను ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ హరిబాబు

మెరకముడిదాం: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్మన్ అతిథిగా హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. తహసీల్దార్ అజూ రఫీజాన్ మాట్లాడుతుండగా పలువురు సభ్యులు స్పందిస్తూ.. రెవెన్యూ సంబంధిత ఎలాంటి సమస్యలూ తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కారం కావడం లేదని, ప్రతీ పనికి కనీసం రెండు నుంచి మూడు నెలల పాటు తిప్పుతున్నారంటూ ధ్వజమెత్తారు.వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తిరస్కరించారని, ఎందుకు తిరస్కరించారని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రజా ప్రతి నిధులకే పనులు చేయడం లేదంటే మీరు సామాన్యులకు ఏం పనులు చేస్తారని తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమలింగాపురం ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు మాట్లాడుతూ గొల్లలమర్రివలస గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల పేరిట వారికి ఉన్న భూమి కంటే ఎక్కువ భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారని, అలాగే సోమలింగాపురం ఎస్సీకాలనీలో ఒకరి భూమిని రెవెన్యూ సిబ్బంది వేరొకరికి పొజిషన్ సర్టిఫికేట్ ఇచ్చారని సభలో వివరించారు. తమ గ్రామాల్లో కూడా రైతులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు చేయడం లేదని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీ సీలు ఆరోపించారు. సభ్యుల ప్రస్తావించిన సమస్యలపై జెడ్పీ చైర్మన్ తీవ్రంగా స్పందించారు. రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి మీపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తహసీల్దార్‌తో పాటు, హెచ్‌డీటీ భాస్కరరావును హెచ్చరించారు.

లోఓల్టేజ్ సమస్య..

విద్యుత్‌శాఖకు సంబంధించి ఏపీఎస్‌ఈబీ దివాకర్ వివరిస్తుండగా..గర్భాం మేజర్ పంచాయతీ సర్పంచ్ గాబ్రియల్ కల్పించుకుని తమ గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ లోఓల్టేజ్ సమస్య తరచూ ఉత్పన్నమవుతోందని, ఎలక్ట్రికల్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని వివరించారు. వెంటనే జెడ్పీ చైర్మన్ విద్యుత్ శాఖ ఏడీకి ఫోన్ చేసి సమస్యను వివరించి, త్వరగా పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సుజలధార ప్రాజెక్ట్ ఏఈలను చైర్మన్ ఆదేశించా రు. వైస్ ఎంపీపీ కందుల పార్వతి, ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్



మెరకముడిదాం: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఒక మహోన్నత వ్యక్తి అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధాన మంత్రిగా దేశానికి సేవచేశారని గుర్తు చేశారు. సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా మంచి పేరు సంపాదించాని అన్నారు.వైస్ ఎంపీపీలు టి.హరిబాబు, కందుల పార్వతి, నాయకు లు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, ఎంపీటీసీ జంపన సావిత్రి, ఎంపీడీఓ జి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వానికిపోరాడిన ఆదర్శనేత

వేపాడ: కులరహిత సమాజంతో పాటు బడుగు బలహీన వర్గాల కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కడుబండి స్థానిక నేతలతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు,ఎంపీపీ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్ గొటివాడ దేవి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గబాబు,నాయకులు బోజంకి రామునాయుడు, కండిపల్లి పెదనాయుడు ఈశ్వరరావు, రమణ, శ్రీను, రామ్మూర్తినాయుడు, బీల సతీష్ పాల్గొన్నారు.



వేపాడ: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు



కొత్తవలస: జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు, సిబ్బంది



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయినులు

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

కొత్తవలస/లక్కవరపుకోట: భారత ఉప ప్రధానిగా, వివిధ మంత్రిత్వ శాఖల్లో మంత్రిగా దేశానికి బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొత్తవలస తహసీల్దార్ బి.నీలకంఠరావు అన్నారు. కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఉద్యోగులతో కలిసి తహసీల్దార్ శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తుమ్మికాపల్లి గేటు సమీపంలోని వాగ్దేవి కళాశాలలో, ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట సమీపంలోని జ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.



చీపురుపల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధారాణి, తదితరులు



వేపాడ: వల్లంపూడిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నేతలు

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, నాయకులు మంగళగిరి శ్రీనివాసరావు, కోరుకొండ దాలయ్య, అడ్డూరి కృష్ణ, గవిడి సురేష్, సూరు దుర్గారావు, ఇప్పిలి కృష్ణ, కర్రోతు ప్రసాద్, రౌతు పైడిరాజు, మూరాడ మహేష్, తలచుట్ల రాము, కూర్మపు సింహాచలం, పాండ్రంకి వాసు పాల్గొన్నారు. అలాగే వల్లంపూడి గ్రామంలో దళిత నేతలు కొమనాపల్లి రాము, గుత్తిశ్రీను, బొర్ర కిరణ్, కలిగొట్ల వీరేస్, అప్పారావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: స్థానిక శ్రీరవితేజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని ఆ పాఠశాల కరస్పాండెంట్ పి.బి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోలో డ్యాన్స్‌లు, శాస్త్రీయ నృత్యాలు, గ్రూప్ డ్యాన్స్‌లు, మిమిక్రీలు, స్కిట్‌లతో సందడి చేశారు. వేడుకలకు సీఐ వి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టూడెంట్ కౌన్సిలర్ జి.ఎస్.డి.రవికుమార్, ఎస్.శ్రీదేవి, వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం పి.బి.వి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందే



మాట్లాడుతున్న నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ జగన్, సభ్యులు

వేపాడ: పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందేనని, ప్రస్తుత డిజైన్ వల్ల వేలాది మంది రైతులు నష్టపోతారని నిర్వాసితులు కమిటీ కన్వీనర్ చల్లా జగన్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వాసితుల కమిటీతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై ఈనెల 7వ తేదీన కొండగుళ్ల గ్రామంలో సదస్సు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోనున్న రైతులు అంతా హాజరు కావాలని కోరారు. ఇది వరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా, అన్ని గ్రామసభల్లోనూ పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని రైతు లు ఏకవాక్య తీర్మానం చేసిన విషయం గుర్తు చేశారు. ఆతీర్మానాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందో లేదో అన్న విషయంపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు రూపకల్పనకు 2007లో చేసిన డిజైన్‌కు నేటికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. తోటపల్లి ,పెద్దగెడ్డ, ఆంధ్ర, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ ప్రాజెక్టు పరిధిలోని భూములు పోలవరం పరిధిలోకి వచ్చాయన్నారు. రైతులకు రైవాడ, తాటిపూడి జలాశయాల నుంచి సాగునీరు ఇచ్చి పోలవరం నీటిని విశాఖపట్నం ప్రజల తాగునీరు,పారిశ్రామిక వాడలకు ఇస్తే ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని, రైతులు భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదన్నారు. నిర్వాసితుల పోరాట కమిటీ జిల్లా నాయకులు రౌతు బాబురావు, మజ్జి శ్రీను, అర్జునరావు, మెలిపాక రమణ, జి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన



విద్యుత్ సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ ముద్రించిన వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం,సీఐటీయూ నాయకులు

శృంగవరపుకోట: స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు పట్టణంలో నిరసన తెలిపారు. సీపీఎం, అనుబంధ సంఘాల కార్యకర్తలు 'స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు–సామాన్యులకు ఉరి వెయ్యొద్దు' అంటూ నినాదాలు చేశారు.సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ప్రధాని మోడీ అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కూటమి సర్కారు అమలు చేస్తోందన్నారు. కూటమి సర్కారు పుణ్యమాని 2014 నుంచి 2025 వరకు వినియోగించిన విద్యుత్‌పై ప్రజల నుంచి రూ.1.40లక్షల కోట్లు వసూలు చేసేందుకు సర్కారు సిద్ధమైపోయిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో నిర్లజ్జగా ప్రజాధనాన్ని ప్రభుత్వం దోపిడి చేస్తోందని మండి పడ్డారు. స్మార్ట్ మీటర్లను ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు బలవంతంగా బిగించి, సామాన్యుల మెడకు ఉరితాడు బిగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం గాలికి పోయిందని, దోపిడీ, అరాచకత్వం, రాజ్యమేలుతోందని ఆరోపించారు. నాడు చంద్రబాబు హయాంలో బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటాన్ని మరోమారు చవిచూడాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు మద్దిల గోవిందరావు,సింహాచలం, షణ్ముఖ్, త్రినాథ్,తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పందిరి రాట



పాలవలసలో పందిరి రాట వేస్తున్న భక్తులు

గుర్ల: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణం జరిపించేందుకు గ్రామాల్లోని రామాలయాల వద్ద గ్రామ పెద్ద ల ఆధ్వర్యంలో శనివారం పందిరిరాటలు వేశారు.

అనంతరం వేడుకలకు రామాలయాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.